# సాక్షి సూర్యాపేట

బుధవారం ◊ 5 ◊ ఏప్రిల్ ◊ 2023






**ఇద్దరి అరెస్ట్**
ఆంధ్రప్రదేశ్ నుంచి ముంబయికి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



**8న ఎయిమ్స్‌కు శంకుస్థాపన**
బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
38°/25°

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.




## న్యూస్‌రీల్

### నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతి

**దురాజ్‌పల్లి :** జిల్లా కేంద్రంలో నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్న ఈ వేడుకలకు కుల సంఘాల, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### మహిళా ఆరోగ్య కేంద్రాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా స్త్రీ.శిశు సంక్షేమ అధికారిణి జ్యోతి పద్మ

**చివ్వెంల(సూర్యాపేట) :** మహిళా ఆరోగ్య కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీ.శిశు సంక్షేమ అధికారిణి జ్యోతి పద్మ కోరారు. మంగళవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్, మెప్మా మహిళా ఉద్యోగులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం మహిళలకు 8 విభాగాల్లో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కోటాచలం, మేప్మా పీడీ రమేష్ నాయక్, వైద్యులు ఆయేషా, రమ్య, నాజియా, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### పనులు సత్వరమే పూర్తి చేయాలి

**మోతె :** పనులు సత్వరమే పూర్తి చేయాలని డీపీఓ యాదయ్య ఆదేశించారు. మండలంలోని భీక్యాతండాలో డంపింగ్ యార్డ్, నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. ఆయన వెంట ఆ గ్రామ సర్పంచ్ ఝూన్సీ, ఎంపీఓ హరిసింగ్ నాయక్, సురేష్ తదితరులున్నారు.

### అందుబాటులో సరిపడా ఎరువులు

**చిలుకూరు:** రైతులకు ఎలాంటి కొరత లేకుండా సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచినట్లు జిల్లా సహకార బ్యాంక్ అధికారి అంబేద్కర్ తెలిపారు. చిలుకూరు ప్రాథమిక సహకార సంఘం గోదాములోని ఎరువులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో చైర్మన్ అలసకాని జనార్దన్, సీఈఓ చిలువేరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### నష్టం వివరాలు ఇవ్వాలి

**తిరుమలగిరి :** ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలు తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో వరి, మామిడి, మిర్చితోటలు దెబ్బతిన్నాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టం వివరాలను అధికారులు అందజేయాలని డీఏఓ రామారావు నాయక్ కోరారు. ఇటీవల కురిసిన వడగండ్లవానకు తిరుమలగిరి మండలంలో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈఓలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రైతు కొంపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 14నుంచి ఇంటింటికీ సీపీఐ

**మునగాల:** ఈనెల 14నుంచి మే 14 వరకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గన్నా చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్‌తో కలసి ఇంటింటికీ సీపీఐ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. ప్రారంభ సభను పార్టీ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ హైదరాబాద్‌లో ప్రారంభిస్తారని , మే14న కొత్తగూడెంలో జరిగే ముగింపు సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ నాయకులు డా.కె.నారాయణ, అజీజ్ పాషా, రాజ్యసభ సభ్యుడు బినయ్ విశ్వం , కేరళ రెవెన్యూ శాఖ మంత్రి కె.రాజన్ పాల్గొంటారని ఆయన వివరించారు.

# భగీరథ నీరు.. తాగుత లేరు

- మూడు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా ఇంటింటికీ నీరు
- మూడు రోజులకోసారి సరఫరా
- అవగాహన లేక తాగేందుకు విముఖత
- ఇంటి అవసరాలకే భగీరథ నీళ్లు
- ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలుకే ఆసక్తి చూపుతున్న జనం



చివ్వెంల మండల కేంద్రంలోని వాటర్ ప్లాంట్ వద్ద నీళ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



ఏపూర్‌లో ప్యూరిఫైడ్ వ్యాటర్ క్యాన్ కొనుగోలు చేసి తీసుకెళ్తున్న మహిళ

**సూర్యాపేట:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం నెరవేరడంలేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా తాగేవారే కరువయ్యారు. మూడు రోజులకోమారు సరఫరా చేయడం.. ఈ నీటి వల్ల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలుగుతుందోనన్న అనుమానాలు వెరసి.. వీటిని తాగడానికి ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదు. దీనిని స్నానాలకు, బట్టలు ఉతకడానికే వినియోగిస్తున్నారు. ప్లాంట్ వద్ద ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలుకే ఆసక్తి కనబరుస్తున్నారు.

**860 ఆవాసాలకు..**

జిల్లాలోని 860 ఆవాసాలకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి మూడు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. చివ్వెంల మండలం బండమీది చందుపట్ల వద్ద ఏర్పాటు చేసిన జలశుద్ధి కేంద్రం ద్వారా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు, నూతనకల్ మండలం చిల్పకుంట వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా తుంగతుర్తి నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు, సూర్యాపేట మండలం ఇమాంపేట వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలతో పాటు మున్సిపాలిటీలకు సురక్షిత తాగునీరు అందుతుంది. అలాగే మిర్యాలగూడ మండలం అవంతీపురం వాటర్‌ట్రీట్మెంట్ ప్లాంట్ నుంచి హుజూర్‌నగర్, నేరేడుచర్ల, సూర్యాపేట మున్సిపాలిటీలతో పాటు కొన్ని మండలాలకు నీటిని సరఫరా చేస్తున్నారు.

**తాగునీటి కోసం రోజుకూ రూ.5 లక్షల ఖర్చు..**

సూర్యాపేట పట్టణంలో 48 వార్డుల పరిధిలోని ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా రోజుకు 20 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నారు. మున్సిపాలిటీలోకి విలీనమైన తొమ్మిది గ్రామపంచాయతీలకు భగీరథ నీళ్లు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పట్టణంలో1996 నుంచి ప్రజలు మినరల్ వాటర్‌కు అలవాటు పడ్డారు. భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నా పట్టణంలో సుమారు 250 కి పైగా వాటర్ ప్లాంట్ల నుంచి రోజుకు 50 వేల వాటర్ క్యాన్లను రూ.10 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తున్నారు. పట్టణ ప్రజలు రోజుకు రూ.5 లక్షలు తాగు నీటి కోసం ఖర్చు చేస్తున్నారు.

- చివ్వెంల మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 28 వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ప్రతి గ్రామపంచాయతీలో రోజూ సుమారు 2 వేల లీటర్ల వరకు నీళ్లను కొనుగోలు చేసి తాగుతున్నారు. అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. వాటర్ ప్లాంట్ వద్ద 20 లీటర్ల క్యాన్‌కు రూ.10 వసూలు చేస్తున్నారు.

**సరిగా సరఫరా కాక**

సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్.ఎస్, పెన్‌పహాడ్, చివ్వెంల, సూర్యాపేట రూరల్, సూర్యాపేట పట్టణాలకు నీటి సరఫరా చేస్తున్నారు. కానీ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఏ ఒక్కరు కూడా మిషన్ భగీరథ నీటిని తాగేవారే లేకుండాపోయారు. సూర్యాపేట పట్టణంతో పాటుగా పలు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పైపులైన్లు ఉన్నా.. ట్యాంక్‌లకు నీళ్లు ఎక్కకపోవడంతో.. ట్యాంక్‌లు ఉన్నా పైపులైన్లు లేకపోవడంతో నీటి సరఫరా కావడం లేదు. మిషన భగీరథ నీళ్లను నియోజకవర్గ, పట్టణ ప్రజలు కేవలం స్నానాలు, బట్టలు ఉతికేందుకు మాత్రమే వినియోగిస్తున్నారు.

**లీకేజీలు ఉండడంతో..**

తిరుమలగిరి(తుంగతుర్తి) :తుంగతుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలు, తిరుమలగిరి మున్సిపల్ పరిధిలో 91 వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో 70 ప్రైవేట్ ఆధ్వర్యంలో, 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్నాయి. అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా సాగుతుంది. ఈ నీటిని ఎక్కువగా ఇతర అవసరాల కోసమే ప్రజలు వినియోగిస్తున్నారు. తాగు నీటి కోసం గ్రామాల్లో ఉన్న వాటర్ ప్లాంట్ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీవారు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ల వద్ద 20 లీటర్ల క్యాన్ రూ.5, ప్రైవేట్ ప్లాంట్ల వద్ద క్యాన్ రూ.10 నుంచి రూ.15 వరకు అమ్ముతున్నారు. మిషన్ భగీరథలో కొన్ని చోట్ల లీకేజీలు ఉండటంతో కొన్ని సమయాల్లో నీటి సరఫరా సాగడం లేదు. తుంగతుర్తి, నాగారం మండలాల్లో ఈ సమస్య ఉంది.

**ఆరోగ్యం దెబ్బతింటుందనుకుంటున్నం**



మిషన్ భగీరథ నీళ్ల నల్లా ద్వారా మూడు రోజులకోమారు సరఫరా చేస్తున్నారు. కానీ ఆ నీటిని కేవలం స్నానానికి, బట్టలు ఉతికేందుకు మాత్రమే వినియోగిస్తున్నాం. ఇప్పటికీ ప్యూరిఫైడ్ వాటర్‌ను మాత్రమే కొనుగోలు చేసుకుని తాగుతున్నాం. భగీరథ నీళ్ల తాగాలా వద్ద అన్న సందిగ్ధంలో ఉన్నాం.. తాగితే ఆరోగ్యం పాడవుతుందని అనుకుంటున్నాం. అయినా ఈ నీటిని తాగాలా..వద్దా అన్న దానిపై అధికారులు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– రఫీ, సూర్యాపేట.

**రూ.10 నుంచి రూ.12 పెట్టి..**


- సూర్యాపేట మండలంలోని 23 గ్రామపంచాయతీల్లోని ప్రతి ఇంటికి మిషన్‌భగీరథ నీళ్లను సరఫరా చేస్తున్నారు. కానీ ఏ ఒక్కరు కూడా భగీరథ నీటిని తాగడం లేదు. కేవలం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లమీదనే ఆధారపడుతున్నారు. మండలంలో 34 వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ప్లాంట్ల వద్ద 20 లీటర్ల క్యాన్ రూ.5. ఇంటికి వచ్చి పోస్తే రూ.10 నుంచి రూ.12 వరకు తీసుకుంటున్నారు.
- పెన్‌పహాడ్ మండలంలోని 29 గ్రామపంచాయతీలకు గాను 22 గ్రామపంచాయతీలకు మిషన్ భగీరథ నీళ్ల సరఫరా చేస్తున్నారు. మిగిలిన ఏడు గ్రామపంచాయతీలకు నీటి సరఫరా కోసం పైపులైన్లు లేవు.. మరికొన్ని గ్రామాల్లో ఉన్నా ట్యాంకుల్లోకి ఎక్కడం లేదు. మిషన్ భగీరథ నీళ్ల తాగడం లేదు. క్యాన్లను కొనుగోలు చేసుకుని తాగుతున్నారు.



ఆత్మకూర్‌లో నీళ్లు కొనుగోలు చేసుకుని బైక్‌పై తీసుకెళ్తున్న వ్యక్తి

## మా అమ్మ చనిపోతే కూడా కాకి ముట్టలే!

- బలగం సినిమా ఫేం కొమురయ్య



మాట్లాడుతున్న కేతిరి సుధాకర్‌రెడ్డి

**తిరుమలగిరి (తుంగతుర్తి):** 'బలగం సినిమాలోని పాత్రలు తెలంగాణ ప్రాంతంలో ప్రతి ఇంటిలో ఎక్కడో ఒక చోట ఉంటాయి. మా అమ్మ చనిపోయినప్పుడు కూడా కాకి ముట్టలేదు' అని బలగం సినిమా ఫేమ్ కొమురయ్య తాత పాత్రదారుడు కేతిరి సుధాకర్‌రెడ్డి అన్నారు. సుధాకర్ రెడ్డి మంగళవారం తిరుమలగిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో కొద్దిసేపు ముచ్చటించారు. తనకు చిన్నప్పటి నుంచి నాటకాలు అంటే ఇష్టమని, చిన్నతనంలోనే విచిత్ర వేషధారణలు, కళాకారునిగా వివిధ పాత్రలు వేశానని చెప్పారు. 'మాది కరీంనగర్ జిల్లాలోని దూపాక. వరంగల్‌లో డిగ్రీ పూర్తి చేసి తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేశాను. పాఠశాలకు వెళ్లేటప్పుడు తెలుగు మాస్టారు శంకరయ్య చెప్పిన రామాయణం, మహా భారతం కథలు తనను ఎంతో ఆకట్టుకునేవి. అప్పటి నుంచే పాటలు పాడుతూ వేషాలు వేస్తూ రచనలు చేసేవాడిని' అని ఆయన చెప్పుకొచ్చారు. 30 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా పనిచేశానని, 2018లో పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. తవ్వ సినిమాలో మొదటిసారి నటుడిగా పరిచయం అయ్యానని తెలిపారు. మల్లేషం, ముత్తయ్య, ఇంటింటి రామాయణం, బాలుగారి టాకీస్, కొత్త గోడలు లాంటి సినిమాలతో పాటు ఇప్పటి వరకు 35 సినిమాల్లో నటించానని తెలిపారు. బలగం సినిమాతో తనకు మంచి పేరు వచ్చిందని తెలిపారు. బలగం సినిమాకు మంచి ఆదరణ ఉందని, ఈ సినిమా చూసిన తరువాత చాలా కుటుంబాలు కలిసిపోవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని సుధాకర్‌రెడ్డి చెప్పారు. మరో రెండు సినిమాల్లో అవకాశం వచ్చిందని తెలిపారు.

## పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

- కలెక్టర్ వెంకట్రావ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు 69 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, వైద్యం, విద్యుత్ ఇతరత్రా సౌకర్యాలు కల్పించడంతోపాటు పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పోలీసు, రెవెన్యూ, తపాలా శాఖ అధికారులసమన్వయంతో చర్యలు చేపట్టామన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డీఈఓ అశోక్, కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి పాల్గొన్నారు.

## టీఆర్‌వీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమేష్‌బాబు

**హుజూర్‌నగర్‌రూరల్ :** రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హుజూర్‌నగర్ మండలం మర్రిగూడేనికి చెందిన పోతురాజు రమేష్‌బాబు (లైన్‌మెన్)ను మంగళవారం ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకోగా అందులో రమేష్‌బాబు ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో పిన్నెని మల్లికార్జున్, బీవీ చారి, పద్మనాభరెడ్డి, శ్రీనివాస్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# యాప్‌లో దళిత బంధు యూనిట్లు

- అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం కొత్త విధానం
- వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శులు
- జిల్లాలో 2,568 యూనిట్లు మంజూరు
- ఇప్పటికే 70 శాతం యూనిట్ల వివరాలు యాప్‌లో నిక్షిప్తం



మామిడాలలో యూనిట్లను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** దళితబంధును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో కేటాయించిన దళిత బంధు కింద అందించిన ఆస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. ఇందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. లబ్ధిదారులకు ఇచ్చిన యూనిట్ల వివరాలను నమోదు చేస్తోంది. దళితబంధు పథకంలో అక్రమాలను అరికట్టేందుకు యాప్ ద్వారా యూనిట్లను గుర్తించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. జిల్లాలో 2,568 యూనిట్లు మంజూరయ్యాయి. వాటి వివరాలు, స్థితిగతులను గత నెల రెండోవారం నుంచి యాప్‌లో నమోదు చేయడానికి గ్రామపంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతం యూనిట్లను యాప్ ద్వారా గుర్తించిన కార్యదర్శులు మరో 30 శాతం గుర్తించడానికి కసరత్తు చేస్తున్నారు.

**నమోదు ప్రక్రియ ఇలా..**

యాప్‌లో అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఫొటోలు తీసి నమోదు చేయాలని ఆదేశించింది. యూనిట్‌కు సంబంధించిన ఇన్ వాయిస్‌లు, బిల్లులు, ఇతర ఫైల్‌లను యాప్‌లో నిక్షిప్తం చేయాలి. అవసరమైన అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆమేరకు లబ్ధిదారులు వివరాలు అందిస్తున్నారు.

**తేలనున్న లెక్కలు**

నియోజకవర్గానికి వంద చొప్పున జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 345 యూనిట్లు ( తుంగతుర్తి నియోజకవర్గంలో కొన్ని మండలాలు యాదాద్రి, నల్లగొండ జిల్లాల్లో ఉండటంతో 55 యూనిట్లు ఆ మండలాలకు కేటాయించారు) మంజూరు చేశారు. ఇక పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన తిరుమలగిరి మండలంలో 2,223 యూనిట్లు అందించారు. ఈ లెక్కన జిల్లాలో 2,568 యూనిట్లు అందాయి. అనర్హులు లబ్ధిపొందారని కలెక్టర్ వరకు ఫిర్యాదులు వెళ్లాయి. కొన్ని యూనిట్లు క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. నమోదు పూర్తయితే యూనిట్ల స్థితిగతులు, లెక్కలు పూర్తిగా తేలనున్నాయి.

**70శాతం వివరాలు నమోదు**

జిల్లాలో మంజూరైన యూనిట్ల స్థితిగతులను గ్రామ కార్యదర్శులు ప్రత్యేక యాప్ ద్వారా గుర్తించి నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 70 శాతం వివరాలు నమోదు చేశారు. భవిష్యత్తులో కూడా మానిటరింగ్ ఉంటుంది.

– శిరీష, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

# ఐదు శాతం రాయితీ

- ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించిన వారికి ఎర్లీబర్డ్ పథకం
- ఈనెల 30 వరకు అవకాశం
- ఐదు మున్సిపాలిటీల్లో అమలు



ముందస్తు పన్ను చెల్లిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

**హుజూర్‌నగర్:** మున్సిపాలిటీల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించినవారి ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తోంది. నిర్దిష్ట గడువులోగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పిస్తోంది. ఇది ఈనెల 30వరకు అమలులో ఉంటుంది. ఈమేరకు పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బిల్ కలెక్టర్‌లు వార్డుల వారీగా ముందస్తు పన్ను వసూళ్లకు శ్రీకారం చుట్టారు.

**ఎవరు అర్హులంటే..**

ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించే వారికి ప్రోత్సాహకంగా ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను పూర్తిగా చెల్లించిన వారితో పాటు బకాయిలను ఫెనాల్టీతో కట్టిన వారికి మాత్రమే ఐదు శాతం రాయితీ వర్తించనుంది. రాయితీ పొందాలంటే ఏప్రిల్ 30లోగా ఆయా మున్సిపల్ కార్యాలయాల్లో, సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించడానికి అవకాశం ఉంది.

**ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు..**

మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్ పథకం అమలులో భాగంగా పన్నుల వసూళ్లకు ప్రత్యేక కేంద్రాలను తెరవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు బిల్‌కలెక్టర్లకు కూడా లక్ష్యాలను నిర్దేశించనున్నారు. ఈ పథకం అమలుపై నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఏటా ఆస్తి పన్నులో వడ్డీమాఫీని అమలు చేస్తున్నారు. కొవిడ్ విజృంభన సమయంలో రూ. 10 వేలలోపు ఆస్తిపన్ను కలిగిన వారికి 50 శాతం వరకు మాఫీ చేశారు. కాగా ప్రస్తుతం ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి అధికారులు 5 శాతం రాయితీని అమలు చేస్తున్నారు.

**పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**



ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భవనాల యజమానులు ముందస్తుగా పన్ను చెల్లించాలి. ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రభుత్వం ఇచ్చే రాయితీ పథకాన్ని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో చెల్లించిన వారికి ప్రోత్సాహకాలను అందజేస్తాం. పురప్రజలు స్పందించి మున్సిపాలిటీకి ఆదాయం సమకూరేలా తోడ్పాటునందించాలి.

– కె .శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

**ఐదు మున్సిపాలిటీల్లో..**

- సూర్యాపేట మున్సిపాలిటీలో 33,062 భవనాలకు 24,140 భవనాలు పన్నులో 5 శాతం రిబేటుకు అర్హత కలిగి ఉన్నాయి. వాటి ద్వారా రూ. 9.27 కోట్ల ఆదాయం సమకూరనుంది.
- కోదాడలో 16,245 భవనాలు ఉండగా వీటిలో 11,979 భవనాలు పన్నులో 5 శాతం రాయితీకి అర్హత కలిగి ఉన్నాయి. వాటి ద్వారా రూ. 3.38 కోట్ల ఆదాయం లభించనుంది.
- హుజూర్‌నగర్‌లో 7,479 భవనాలకు గాను 2,437 భవనాలు పన్నులో 5 శాతం రిబేటుకు అర్హత కలిగి ఉన్నాయి. వాటి ద్వారా రూ. 84.37 లక్షల ఆదాయం రానుంది.
- తిరుమలగిరిలో 6,306 భవనాలు ఉండగా వాటిలో 5,267 భవనాలు 5 శాతం రిబేటుకు అర్హత కలిగి ఉన్నాయి. వాటి ద్వారా రూ. 1.33 కోట్ల ఆదాయం రానుంది.
- నేరేడుచర్లలో 4,262 భవనాలు ఉండగా వీటిలో 2,879 భవనాలు 5 శాతం పన్ను రాయితీకి అర్హత కలిగి ఉన్నాయి. వాటి ద్వారా రూ. 64.58 లక్షల ఆదాయం రావాల్సి ఉంది.

## పథకాలు అందేలా చూడాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక

**సూర్యాపేటటౌన్ :** వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలని జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో 1, 7, 2, 4వ స్థాయీ సంఘాల సమావేశాలు ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ఆత్మకూర్.ఎస్ మండలం ఏపూర్ గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చినందున అభినందనలు తెలిపారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రొటోకాల్ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీటీసీ మాట్లాడుతూ చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, హద్దులు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నేరేడుచర్ల జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల వెంట ఇటుక బట్టీలు నడుపుతున్నారని, ప్రమాదాలకు కారణమవుతున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హుజుర్‌నగర్ జెడ్పీటీసీ మాట్లాడుతూ వైద్యుల వివరాలను ప్రభుత్వ ఆస్పత్రుల బోర్డుల్లో ఏర్పాటు చేయాలన్నారు. చివ్వెంల జెడ్పీటీసీ మాట్లాడుతూ సహకార బ్యాంక్ ద్వారా వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని కోరారు. సమావేశాల్లో జెడ్పీ సీఈఓ సురేష్ పాల్గొన్నారు.

## మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి:** మట్టపల్లి ఆలయంలో నిత్య కల్యాణాన్ని మంగళవారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుప్రభాతసేవ, నిత్యహోమం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, పంచగవ్యప్రాశన, మాంగల్యధారణ వేద మంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నూరు విజయ్ కుమార్ , నవీన్, రామాచార్యులు , పద్మనాబాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి ,ఆంజనేయాచార్యులుపాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రైలు నుంచి పడి వ్యక్తి మృతి

**వలిగొండ :** గుర్తుతెలియని రైలు నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నాతాళ్లగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. నాతాళ్లగూడెం సమీపంలోని రైల్వే ట్రాక్ పై ఒడిశాకు చెందిన ప్రదీప్ గౌడ (35) రాత్రి సమయంలో గుర్తుతెలియని రైల్ నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు.ఉదయం రైల్వే లైన్ వెంట వెళుతున్న సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే సీఐ పవన్ ఇంగ్లే తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

**మిర్యాలగూడ టౌన్ :** అనుమానాస్పద స్థితిలో రైతు మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండల పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం జాలుబావితండాకు చెందిన భూక్య నాగు(48) సోమవారం రాత్రి పొలం వద్దకు అని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా కూడా ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఉదయం పొలం వద్దకు వెళ్లగా సమీపంలోని జంజిరాల కుంటలో విగతజీవుడిగా కనిపించాడు. కాగా, ఈ ఆలగడప చెరువు సొసైటీలో అంతర్గత పోరు ఉండటంతో రాత్రికి రాత్రి ఎవరికి వారు చేపలు పట్టుకుంటున్నారు. నాగు పొలం వద్దకు వెళ్లేటప్పుడు హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా మృతదేహం మొత్తం ఒడ్డున ఉండగా కాళ్లు మాత్రమే నీటిలో ఉన్నాయి. కాగా నాగు ఒంటిపై బట్టలు లేకపోవడంతో మరింత అనుమానాలకు దారి తీస్తుంది. నాగును హత్య చేసి ఒడ్డుకు తీసుకవచ్చి పడవేశారని భార్య రంగమ్మ ఆరోపిస్తోంది. ఘటన స్థలాన్ని మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**మిర్యాలగూడ అర్బన్:** గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపట్టణంలోని ఇందిరమ్మకాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. ఇందిరమ్మకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. దీంతో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారం, ఎనిమిది తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. మంగళవారం సాయంత్రం బాధితుడి వియ్యంకుడు వెంకటేశ్వర్లు ఇంటిని పరిశీలించగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకుసీఐ రాఘవేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### దుకాణంలో నగదు చోరీ

**మేళ్లచెరువు :** గుర్తుతెలియని వ్యక్తులు దుకాణంలోని రూ.70వేల నగదును చోరీ చేశారు. ఈ ఘటన మేళ్లచెరువులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు నందు రామకృష్ణ అయిల్ అండ్ జనరల్ స్టోర్‌లోకి సోమవారం రాత్రి వెనుక డోర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. షాపులో అమర్చిన సీసీ కెమారాలు ,వాటికి సంబంధించిన హార్డ్ డిస్కును, క్యాష్ కౌంటర్ లో 70 వేల రూపాయలు నగదును అపహరించుకుపోయారు. షాపు యజమాని రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# అకాల వర్షం.. అతలాకుతలం

- నేలవాలిన వరిచేలు
- ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం రాశులు
- రాలిన మామిడి, బత్తాయి కాయలు



కురంపల్లి ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు

**కనగల్:** కనగల్ మండలంలోని పలు గ్రామాల్లో పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అకాల వర్షానికి చేతికి వచ్చిన వరిపంటలు నేల కొరిగాయి. పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఇప్పటికే నిమ్మ, మామిడి, బత్తాయి చెట్లు ఈదురుగాలుల బీభత్సానికి కూకటి వేళ్లతో సహ నేలన పడ్డాయి. కాయలు పూర్తిగా రాలిపోయాయి. మామిడి కాయలు రాలాయి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. కనగల్ మండల వ్యాప్తంగా ప్రధానంగా యాసంగి సీజన్‌లో వరిపంటనే సాగుచేస్తారు. చేతికి వచ్చిన పంటలు ఆకాల వర్షం కారణంగా నష్టం జరగడంతో రైతులకు దుఃఖమే మిగిలింది. ఇక మిగిలింది కన్నీళ్లే అని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**కల్లాల్లో తడిసిన ధాన్యం**

అకాల వర్షాలతో పంటలు నేలకొరిగి, గింజలు రాలడంతో దిగుబడి తక్కువ వచ్చిందని అనుకున్న క్రమంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు చివరికి ఐకేపీ కేంద్రాల్లో పోసిన ధాన్యం కూడా తడిసి ముద్దయింది. తంటాలు పడి ధాన్యం కేంద్రాల్లో నిలిచిన నీటిని బయటకు తీసేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సి వచ్చింది.

**వరిచేలు నెలకొరిగాయి**



“ మండలంలోని కురంపల్లి, రాంచంద్రపురం, రేగట్టే, శాబ్దుల్లాపురం, పాపాట్లవాయి, లింగాలగూడెం, పానుగోడు, చర్లగౌరారం, మంచినీళ్లబావి గ్రామాల్లో ప్రధానంగా వరి పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాము. ఈ గ్రామాల్లో ఈదురుగాలలు వర్షానికి కారణంగా వరిపంటలు నేలకొరిగి 30శాతానికి పైగా గింజలు రాలాయి.

– బెజవాడ అమరేందర్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి

### ఆత్మకూరు (ఎం)లో ..



ఆత్మకూరు(ఎం)లో రోడ్డుపై కూలిన చెట్టు

**ఆత్మకూరు(ఎం):** ఆత్మకూరు(ఎం) మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో పలు చోట్ల రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలాయి. మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కరెంట్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పారుపల్లిలో పౌల్ట్రీఫారాల పైకప్పు కూలిపోయాయి. పలు గ్రామాల్లో వడ్లు రాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ జయమ్మ ఆదేశం మేరకు ఆర్‌ఐ చిప్పలపెల్లి యాదగిరి సందర్శించి జరిగిన నష్టాన్ని పరిశీలించారు.



పారుపల్లిలో గాలులకు కూలిపోయిన కోళ్లఫారం షెడ్డు, చనిపోయిన కోళ్లు

### మోటకొండూరులో..

**మోటకొండూర్:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలో రైతు సింగిరెడ్డి ఎల్లారెడ్డి పశువుల పాక రేకులు లేచిపోయాయి. అలాగే వరి చేను చేతికందే సమయానికి కురిసిన వాన ఈదురు గాలులకు నేల రాలాయి.



గాలులకు లేచిపోయిన పశువుల పాక

### రాజాపేటలో..

**రాజాపేట:** మండలంలోని బొందుగుల, సోమవారం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. ఈదురుగాల బీభత్సానికి మామిడి కాయలు రాలిపోగా వరిచేలు నేల వాలాయి.



బొందుగులలో రాలిన మామిడి కాయలు

### గుర్రంపోడులో వడగండ్ల వాన



పిట్టలగూడెంలో నేలమట్టమైన డెయిరీ ఫామ్



కొప్పోలులో గోడ కూలి మృతిచెందిన దూడలు

**గుర్రంపోడు :** గుర్రంపోడు మండలంలో మంగళవారం సాయంత్రం గాలిదుమారంతోపాటు కురిసిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. గుర్రంపోడు, కొప్పోలు, ఆమలూరు, పిట్టలగూడెం, నడికూడ, బొల్లారం తదితర గ్రామాల్లో తీవ్ర ఆస్తి, పంట నష్టం జరిగింది. పిట్టలగూడెంలో కేసాని యాదగిరిరెడ్డి డెయిరీ ఫామ్ నేలమట్టమై 15 లక్షల ఆస్తినష్టం జరిగింది. గ్రామంలోని నిమ్మ తోటలు నేలకొరగడం, బత్తాయి పిందెలు రాలడం, కూరగాయల పందిళ్లు దెబ్బతిన్నారయి. కొప్పోలులో బైరవొని నగేష్‌కు చెందిన రెండు దూడలు గోడ కూలి చనిపోయాయి. ఇదే గ్రామంలో రుద్రాక్షి లావణ్యపై రేకులు పడి చేయి విరిగింది. ఆయా విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరా నిలిచిపోయింది. ఒక్క కొప్పోలు గ్రామంలోనే 20 విద్యుత్‌స్తంభాలు విరిగిపోయా యి. నల్లగొండ–దేవరకొండ ప్రధాన రహదారిపై చెట్టు కూలిపోవడం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొప్పోలు గ్రామంలోబా.దిత కుటుంబాలను ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు పరామర్శించారు.



బొల్లారంలో రాలిన బత్తాయి కాయలు

**అంధకారంలో పలు గ్రామాలు**

విద్యుత్ స్తంభాలు విరిగిపడి కొప్పోలు, పిట్టలగూడెం, నడికూడ, బొల్లారం, ఆమలూరు తదితర గ్రామాల్లో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు కూడా పడటంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ సాధ్యపడలేదు.

### అడ్డగూడూరులో..



అడ్డగూడూరులో వర్షానికి తడిసిన ధాన్యం

**అడ్డగూడూరు :** మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులు, వడగండ్ల వర్షం బీభత్సం సృషించింది. మండల కేంద్రంలో బుట్టి యాదయ్యకు చెందిన 13ఎకరాలు మామిడి తోటలో కాయలు నేలరాలాయి. గుట్టుసింగారం గ్రామంలో సాకేతపురం భిక్షం, కదారి శోభకు చెందిన నాలుగు మేకలపై వేపచెట్టు మీద పడటంతో మృతి చెందాయి. మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.



రాలిన మామిడికాయలు

### నాగారంలో..

**నాగారం:** మండలంలో మంగళవారం రాత్రి అకాల వర్షాంతో పాటు, భారీ ఈదురు గాలులు వీచాయి. ఈదురు గాలులుకు డి.కొత్తపల్లిలో గ్రామంలో మర్రిపల్లి సాయిలు, తొడుసు శ్రావణ్‌కుమార్, కాసం భద్రయ్యల ఇంటి పైకప్పులు లేచిపోయాయి. గైగుళ్ల రామలింగయ్య ఇంటి ఆవరణలో చెట్టు కూలి దూడ మృతి చెందింది. అలాగే మాచిరెడ్డిపల్లి గ్రామంలో చెట్టుకూలి ఇంటి పైకప్పుపై పడటంతో ఈదుల నరసింహ పెంకుటిళ్లు ధ్వంసమైంది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బోర్డులు ఈదురు గాలులకు కూలిపోయాయి. మండలంలోని ఫణిగిరి, ఈటూరు తదితర గ్రామాల్లో వరిచేలునేలకొరిగాయి.



మాచిరెడ్డిపల్లిలో ఇంటిపై కూలిన చెట్టు

### మోత్కూరులో..

**మోత్కూర్ :** మోత్కూర్ మండలంలో మంగళవారం భారీ ఈదుల గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఇళ్ల పైకప్పులు లెచిపోయాయి. మామిడి కాయలు నెల రాలయి. చెట్లు విరిగి పడటంతో సుమారు 100 కరెంటు స్తంభాలు విరిగిపోయాయి. మున్సిపల్ కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది.



మోత్కూరులో ఈదురుగాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు

### హాలియాలో భారీ వర్షం

**హాలియా :** అనుముల మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలతో కూడిన భారీ వర్షం పడింది. ఈదురుగాలుల బీభత్సానికి పట్టణంలోని ఆరవ వార్డులో వర్ర సిద్దారెడ్డికి చెందిన ఐస్ ఫ్యాక్టరీ పైకప్పు రేకులు గాలికి ఎగిరిపడి పగిలిపోయాయి. దీంతో బాధిత కుటుంబానికి సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాట్టిలింది. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ గౌనీ సుధారాణి, గౌనీ రాజారమేష్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



హాలియాలో ఈదురు గాలులకు లేచిపోయిన ఐస్ ఫ్యాక్టరీ పైకప్పు

## వెదిరె, రావి విగ్రహాలు ఏర్పాటు చేయాలి

- మంత్రికి వినతిపత్రం అందజేసిన వెదిరె రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి వారసులు



మంత్రి జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెదిరె రాంచంద్రారెడ్డి వారసులు

**భూదాన్‌పోచంపల్లి :** ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డితో పాటు తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం వెదిరె రాంచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు వెదిరె వినయ్ చంద్రారెడ్డి, డాక్టర్ వెదిరె ప్రభోద్ చంద్రారెడ్డి, వెదిరె అరవిందారెడ్డిలతో పాటు రావినారాయణరెడ్డి మనుమరాలు రావి ప్రతిభ మంత్రి జగదీష్‌రెడ్డికి హైదబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచార్య వినోబాభావే 1951లో పోచంపల్లికి వచ్చినప్పుడు వెదిరె రాంచంద్రారెడ్డి తన వంద ఎకరాల భూమిని నిరుపేదలకు దానం చేసి భూదానోద్యమానికి బీజం వేశారని గుర్తుచేశారు. అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాటానికి సారథ్యం వహించిన రావి నారాయణరెడ్డి 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించి చరిత్రపుటలకెక్కారని అన్నారు. భవిష్యత్ తరాలకు భూదాన ప్రాశస్త్యం, తెలంగాణ పోరాట స్ఫూర్తిని అందించడానికి వారి స్మారకార్థం ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

**మఠంపల్లి:** వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. నాగార్జునసాగర్, మఠంపల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన పలువురు కూలీలు గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ, ముత్యాలంపాడు గ్రామాల్లో మిర్చి ఏరేందుకు వెళుతున్నారు. ఈక్రమంలో గ్రామం నుంచి టాటాఏస్ ఆటోలో సుమారు 30మంది కూలీలు మంగళవారం బయలుదేరారు. మార్గమధ్యలో మట్టపల్లి వైపు నుంచి హుజూర్‌నగర్‌వైపు వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న పలువురు కూలీలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

**ట్రాక్టర్ బోల్తా పడి..**

**నాగార్జునసాగర్:** ఆర్టీసీ బస్సును తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన నాగార్జునసాగర్‌లోని దయ్యాలగండి మూలమలుపు వద్ద చోటు చేసుకుంది. నాగార్జునసాగర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మాచర్లకు వెళతుంది. రమావత్ దస్రు(24) ట్రాక్టర్‌పై హిల్ కాలనీ నుంచి బెట్టల తండాకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో దయ్యాలగండి మూలమలుపు వద్ద బస్సు ఒక్కసారిగా దూసుకురావడంతో దానిని తప్పించేందుకు ట్రాక్టర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టి బోల్తాకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ రమావత్ దస్రూకు గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



గాయపడిన డ్రైవర్‌ను ఆటో ఎక్కిస్తున్న సీఐ

# గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

- రూ.20లక్షలు విలువైన 117 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితుల వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్ చిత్రంలో డీఎస్పీ



గంజాయి రవాణాకు కారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్

**కోదాడరూరల్ :** ఆంధ్రప్రదేశ్ నుంచి ముంబాయికి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.20లక్షల విలువైన 117.30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోదాడ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాకు చెందిన సల్మాన్‌మాలిక్, అరుణ్‌లు స్నేహితులు. వీరు లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో ఎదైనా అక్రమ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వారు చేపలలోడ్‌తో ఏపీలోని రాజమండ్రి వెళ్లిన సమయంలో గంజాయి వ్యాపారం చేసే చిరంజీవి గురించి తెలుసుకున్నారు. గత నెల 28న చిరంజీవిని కలిశారు. గంజాయిని రవాణా చేస్తే రూ.12వేలు ఇస్తానని అతను తెలపడంతో వారు ఆ పని చేసేందుకు ఒప్పుకున్నారు.

**ఐరన్ బాక్స్‌లు..**

గంజాయి రవాణా విషయం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు కారులో ప్రత్యేకంగా తయారు చేసిన ఓ ఐరన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. వాటిని సీట్లకింద, డిక్కీ కింది భాగంలో గుర్తించలేని విధంగా సెట్ చేసి 63 ప్యాకెట్లలో ( కేజీ, రెండుకేజీల చొప్పున 63 ప్యాకెట్లలో 117.30 కేజీలను గంజాయిని పెట్టి ముంబాయికి వెళ్లమని చెప్పాడు. ముంబాయి చేరుకున్నాక ఎక్కడ ఎవరికి గంజాయిని అప్పగించాలో చెప్తానని... మాట్లాడుకున్నదానిలో రూ.6వేలను ముందుగా ఇచ్చి మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పి కారులో పంపించాడు.

**పోలీసులను చూసి..**

రాజమండ్రి నుంచి కారులో బయలుదేరిన తర్వాత పోలీసుల కంటపడకుండా చెక్‌పోస్టులను దాటుకుంటూ వస్తున్నారు. మార్గమధ్యలోని కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్ వద్దకు రాగానే వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసిన వారు కారును వదిలిపెట్టి పారిపోయారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకొని సల్మాన్‌మాలిక్, అరుణ్‌లను రిమాండ్‌కు తరలించారు.చిరంజీవి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి కారు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.20లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, రూరల్ ఎస్‌ఐ సాయిప్రశాంత్, చిలుకూరు ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది సమ్మద్, నిరంజన్, ఉపేందర్, శ్రీకాంత్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో పట్టణ శివశంకర్, మునగాల ఎస్‌ఐ లోకేష్ తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### 'ఇంటింటికీ సీపీఐ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

**నూతనకల్ :** ఈ నెల 14 నుంచి మే 14 వరకు నిర్వహించే ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటికీ సీపీఐ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం ఈ నెల 14న హైదరాబాద్‌లో ప్రారంభమై 119 నియోజకవర్గాల్లో పూర్తి చేసుకొని కొత్తగూడెంలో ముగింపు సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మద్దెల రామ్మూర్తి, కనకటి లక్ష్మయ్య, మైలారపు ఉప్పలయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆటో వసతి

**అర్వపల్లి :** పర్సాయపల్లి సర్పంచ్ పుప్పాల శేఖర్ పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఆటో వసతి ఏర్పాటు చేశారు. విద్యార్థులను అర్వపల్లిలోని పరీక్ష కేంద్రానికి చేర్చి, తిరిగి గ్రామానికి తీసుకొచ్చేలా తన సొంత ఖర్చులతో ఆటోను సమకూర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఆటో వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

### ఈదురు గాలులు, వర్షం

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలి వీచింది. అలాగే చిన్నపాటి వర్షం కురిసింది. ఈదురు గాలితో పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. సెల్‌టవర్‌లు సిగ్నల్ నిలిచి పోయి వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

### కాంగ్రెస్‌లో ఎవరూ ఉండే పరిస్థితి లేదు



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వరరావు

**దురాజ్‌పల్లి :** కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఎప్పటికైనా పొత్తు పెట్టుకుంటాయని, ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఎవరూ ఉండే పరిస్థితి లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజునాయక్ తండా, దాస్‌తండా, పిన్నాయిపాలెం గ్రామాల నుంచి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఈ నెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని 264 పోలింగ్ బూత్‌లలో పార్టీ జెండాల ఆవిష్కరణ, అనంతరం బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెన్న శశిధర్‌రెడ్డి, ఉప్పు శ్రీనివాస్, సలిగంటి వీరేంద్ర, పలస మల్సూర్, అబీద్ పాల్గొన్నారు.


### పరీక్ష కేంద్రాల తనిఖీ

**చివ్వెంల :** పదో తరగతి పరీక్షల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని జి.తిర్మలగిరి గ్రామంలోని పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి అశోక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను, మౌలిక వసతి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా చూడాలని సంబంధిత కేంద్రాల సీఎస్‌లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ, తహసీల్దార్ పాల్గొన్నారు.

**తనిఖీ చేసిన జిల్లా స్క్వాడ్ బృందం**

**అర్వపల్లి :** పదో తరగతి పరీక్షల నేపథ్యంలో అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ పరీక్ష కేంద్రాలను మంగళవారం జిల్లా స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రవణ్‌కుమార్, మేళ్లచెర్వు తహసీల్దార్ దామోదర్‌రావు, ఎస్‌ఐ బాలునాయక్, స్థానిక ఎంఈఓ బాలునాయక్, సీఎస్‌లు, డీఓలు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**తిరుమలగిరి :** ఈ వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో కూడిన బదిలీలు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు సీహెచ్.సోమయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ తిరుమలగిరి, నాగారం మండలాల ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సర్వీస్ రూల్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సోమయ్య, ఆర్.యాదయ్య, వీఎల్‌ఎన్‌చారి, నాగయ్య, బాలరాజ్, సంజీవ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హైవే బ్యారియర్స్‌పై దొంగల కన్ను

- జాతీయ రహదారులపై వరుసగా చోరీలకు పాల్పడుతున్న దుండగులు
- గతంలో 365 హైవేపై.. తాజాగా 365బీ హైవే వెంట
- మొత్తం చోరీ అయిన సామగ్రి రూ.20లక్షలకు పైగానే



సూర్యాపేట మండలం బాలెంల సమీపంలో చోరీ అయిన సైడ్ రెయిలింగ్



తిమ్మాపురం సమీపంలో..

**అర్వపల్లి :** ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి జాతీయ రహదారుల విస్తరణ చేపట్టింది. మండల పరిధిలో సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారి, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులను విస్తరించారు. హైవేల వెంబడి ప్రమాదాల నివారణ కోసం రోడ్డుకు రెండు వైపులా పలు ప్రాంతాల్లో సైడ్ క్రాష్ బ్యారియర్స్ నిర్మించారు. వీటిపైన సైడ్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఈ బ్యారియర్స్ ఏర్పాటు మూలంగా వాహనాలు పడిపోయినపుడు ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. అయితే దొంగలు మాత్రం ఇదే అదనుగా భావించి ఈ ఇనుప క్రాష్ బ్యారియర్స్‌ల చోరీకి పాల్పడుతున్నారు. బ్యారియర్స్ పైభాగంలో ఉండే సైడ్ రెయిలింగ్‌ను చోరీ చేసి పాత ఇనుముకు విక్రయిస్తున్నారు. ఇటీవల వీటి చోరీ పెరిగిపోయింది. గతేడాది నకిరేకల్–తానంచర్ల హైవే వెంట తుంగతుర్తి నుంచి అర్వపల్లి వరకు పలుచోట్ల రెయిలింగ్‌ను దొంగలు చోరీ చేశారు. మళ్లీ తాజాగా నాలుగు రోజుల కిందట సూర్యాపేట–జనగామ 365బీ హైవే వెంట సూర్యాపేట నుంచి జాజిరెడ్డిగూడెం మండలం వేల్పుచెర్ల వరకు పలుచోట్ల సైడ్ రెయిలింగ్‌ను దొంగలు చోరీ చేశారు. అయితే విషయం తెలిసిన హైవే అధికారులు ఆయా మండలాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

**రూ.20లక్షలకు పైగానే సామగ్రి చోరీ..**

సూర్యాపేట–జనగామ హైవేపై చోరీ అయిన రెయిలింగ్ సుమారు 500మీటర్ల పొడవున ఉంటుంది. దీని విలువ సుమారు రూ.10లక్షలకు పైగానే ఉంటుంది. గతంలో నకిరేకల్–తానంచర్ల హైవే వెంట చోరీ అయిన సామగ్రి విలువ కూడా రూ.10లక్షలకు పైగానే ఉంటుందని అప్పట్లో హైవే అధికారులు అంచనా వేశారు. పోలీసులు నిఘా పెంచి దొంగల ముఠా ఆటకట్టించాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

**ప్రజా ఆస్తిని కాపాడుకోవాలి**



ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం కోట్లు వెచ్చించి రోడ్ల విస్తరణ చేపట్టింది. ప్రమాదాలు జరగకుండా హైవేల వెంట క్రాష్ బ్యారియర్ల నిర్మాణం చేపట్టింది. అయితే దొంగలు ఈ బ్యారియర్స్ పైన ఉండే సైడ్ రెయిలింగ్‌ను చోరీ చేస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం బ్యారియర్ల నిర్మాణం చేపడితే వీటిని చోరీ చేయడం తగదు. ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– ధరావత్ బాలునాయక్, ఆర్అండ్‌బీ ఎన్‌హెచ్ విభాగం డీఈఈ

## నైతిక విలువలతో కూడిన విద్య బోధించాలి



చిన్నారులతో కేతిరి సుధాకర్‌రెడ్డి, తదితరులు

**తిరుమలగిరి :** ఉపాధ్యాయులు పిల్లలకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలని బలగం సినిమా నటుడు కొమురయ్య తాత పాత్రదారి కేతిరి సుధాకర్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లలకు ఏ రంగం ఇష్టం ఉంటే ఆ రంగానికే వెళ్లేలా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు స్లేట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకియాట్రిస్ట్ వశిష్ఠ జెడ్డ, ప్రిన్సిపాల్ నరేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రం గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సురేష్, వెంకటేశ్వర్లు, పద్మారెడ్డి, లక్ష్మయ్య, నర్సయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాల సంక్షేమం



పటేల్ రమేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

**సూర్యాపేట రూరల్ :** బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాళ్లఖమ్మంపహాడ్, మిట్టగూడెం, కేసారం గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ మహాపాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. అధికార పార్టీలు తమ పబ్బం గడుపుకోవడానికి రాజకీయ జిమ్మిక్కులు చేస్తున్నాయని ఆరోపించారు. ఇతర పార్టీల లాగా స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ ఏనాడూ పని చేయలేదని గుర్తు చేశారు. రాష్ట్రం, దేశంలో అవినీతి పాలన అంతమొందించేందుకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద సాయంత్రం 5గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, బాలాజీ, చింత శ్రీను, ఎడ్ల వీరమల్లు, వెంకన్న, బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు, స్వామి నాయుడు, ఫరూక్, దేవేందర్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, గోపాల్‌రెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్స్ బృందం

**అర్వపల్లి :** సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా షీ టీమ్స్ ఏఎస్‌ఐ పాండునాయక్ కోరారు. మంగళవారం అర్వపల్లిలోని నాగారం కేజీబీవీలో బాలికలకు షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, రక్షణ, లింగ వివక్ష, టోల్‌ఫ్రీ నంబర్ 1930, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్‌ల వల్ల కలిగే అనర్థాల గురించి పోలీస్ కళాబృందంచే వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు జాఫర్, యల్లారెడ్డి, ఎస్‌ఓ ఎండీ.శిరీన్, శివరాం, సాయిజ్యోతి, సురేష్, రమణ, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, నాగార్జున, కృష్ణ, గురులింగం పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

**పెన్‌పహాడ్ :** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలో ఇటీవల జిల్లా స్థాయి అవార్డులు సాధించిన అనంతారం గ్రామ సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, చీదెళ్ల సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంజయ్‌కుమార్‌లతో పాటు మండలంలోని సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఆర్ఐ మట్టయ్య పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



కుక్కడంలో ధ్వంసమైన కోళ్లషెడ్‌ను పరిశీలిస్తున్న అన్నెపర్తి జ్ఞానసుందర్, తదితరులు

**మద్దిరాల :** అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ డిమాండ్ చేశారు. మద్దిరాల మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో ఇటీవల వచ్చిన ఈదురు గాలులకు గొండ్యాల కొమురయ్య, కోడి శోభ, బింగి భిక్షంలకు చెందిన కోళ్లషెడ్‌లు పూర్తిగా ధ్వంసం కాగా వారిని పరామర్శించారు. నల్లగంటి పుల్లయ్య తన వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసుకున్న షెడ్‌లో దాదాపుగా 50 క్వింటాల పత్తి పూర్తిగా తడిసి పాడై పోవడంతో అతడిని పరామర్శించారు. వాసుదేవరెడ్డికి చెందిన 20 ఎకరాల మామిడి తోటలో మామిడి కాయలు రాలి పోవడంతో అతడిని పరామర్శించారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను, ఆయా గ్రామాల ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల నరేష్, పాల్వాయి పరశురాములు, అండెం రవి, గొండ్యాల కొమురయ్య, కృష్ణమూర్తి, పుల్లయ్య, గణేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతి కేసీఆర్‌తోనే సాధ్యం



తుంగతుర్తిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తిరుమలగిరిలో..



అర్వపల్లి : సూర్యనాయక్‌తండాలో..



నూతనకల్‌లో..

**తుంగతుర్తి :** గిరిజనుల అభ్యున్నతి కేసీఆర్‌తోనే సాధ్యమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో బంజారా భవనానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 2కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల మంగళవారం బీఆర్‌ఎస్ గిరిజన నాయకులు మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు సత్యవతిరాథోడ్, జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, గుండగాని రాములుగౌడ్, దీప్లానాయక్, యాకోనాయక్, విజ్జి నాయక్, శంకర్ నాయక్, వీరోజీ, వెంకన్న, రాములు, భాస్కర్, శ్రీను, యాదగిరి, వెంకన్న, భిక్షం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**తిరుమలగిరి :** తుంగతుర్తి నియోజకవర్గంలో బంజారా భవన్‌కు రూ.2 కోట్లు కేటాయించడంతో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, మాజీ సర్పంచ్ హరిశ్చంద్రనాయక్, యాకూబ్‌నాయక్, రవీందర్, కిష్టునాయక్, లక్ష్మయ్య, యాకూబ్, సామ ఆంజనేయులు, సందీప్, రవీందర్ పాల్గొన్నారు.

**రూ.2 కోట్లు కేటాయించడంపై సంబరాలు**

**అర్వపల్లి :** నియోజకవర్గంలో బంజారా భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రూ.2కోట్ల నిధులు మంజూరు చేయించడాన్ని హర్షిస్తూ సూర్యనాయక్ తండాలో సర్పంచ్ లునావత్ స్వాతిరవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రులు సత్యవతిరాథోడ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పీరమ్మ, మాణిక్యం, ఎంపీటీసీ బిక్కునాయక్, ఉప సర్పంచ్ సుజాతసంజీవ్‌నాయక్, భీముడు, కేలోతు రవీందర్ నాయక్, కేతావత్ శ్రీను, అచ్చమ్మ, బుజ్జమ్మ, భద్రు నాయక్, బీమానాయక్, సురేందర్, నాగులు, వెంకటేశ్, గిరిజన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం**

**నూతనకల్ :** తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో గిరిజన, బంజారా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. భవన నిర్మాణానికి కృషి చేసిన మంత్రులు సత్యవతి రాథోడ్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, భూరెడ్డి సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, గుగులోతు సురేందర్ నాయక్, లావుడ్యా సజ్జనాయక్, లావుడ్యా నర్సింహ, గుగులోతు శంకర్ నాయక్, బద్దం ప్రశాంత్‌రెడ్డి, పాతులోతు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జగ్జీవన్‌రాం జయంతి

**మద్దిరాల :** నేడు నిర్వహించే బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను, ఈనెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పాల్వాయి పరశురాములు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మద్దెల నరేష్, గణేష్, రాంపాక వెంకన్న, మధు, అండెం రవి, చంద్రయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి



తిరుమలగిరి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



నాగారం : పసునూర్‌లో..

**తిరుమలగిరి :** రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు, 10 కేజీల సన్న బియ్యం ఉచితంగా సరఫరా చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు రూపొందించిన పోస్టర్లను మంగళవారం తిరుమలగిరిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి కొండయ్య, గోగుల వీరబాబు, లక్ష్మి, సైదమ్మ, మంగమ్మ, ప్రశాంత్, జాని, రాంబాబు పాల్గొన్నారు.

**నాగారం :** ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని పీవైఎల్ జిల్లా నాయకుడు వేర్పుల కర్ణాకర్, పీఓడబ్ల్యూ జిల్లా నాయకుడు నల్లగంటి సుగుణమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం పసునూర్ గ్రామంలో పీవైఎల్, పీఓడబ్ల్యూల ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 15 వరకు గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు దీనికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా గ్రామ కార్యదర్శి నల్లగంటి కృష్ణయ్య, పీఓడబ్ల్యూ నాయకులు గోపమ్మ, వెంకటనర్సమ్మ, పద్మ, శాంతమ్మ, ఉమ, మరియమ్మ, రామతార, పీవైఎస్ నాయకులు హుస్సేన్, యాకూబ్, రాజు పాల్గొన్నారు.

**తుంగతుర్తి :** రేషన్ దుకాణాల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర సరుకులను ఉచితంగా అందజేయాలని పీవైఎల్ జిల్లా నాయకుడు వేల్పుల పరశురాం అన్నారు. పీఓడబ్ల్యూ తలపెట్టిన ఉద్యమాలను జయప్రదం చేయాలని మంగళవారం మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా 12రకాల నిత్యావసర సరుకులు, 10కేజీల సన్న బియ్యం ఇవ్వాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దికుంట్ల నిఖిల్, వేల్పుల లక్ష్మయ్య, గోపమ్మ, సుగుణమ్మ, హుస్సేన్, గంగరాజు, అస్లాం, అవిలయ్య పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



సూర్యాపేట : 43వ వార్డులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ



ఆత్మకూరు (ఎస్) : రామన్నగూడెంలో కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అనసూర్య



పెన్‌పహాడ్ : రంగయ్యగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ భిక్షం



మద్దిరాల : పోలుమల్ల గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఏ.రజాక్



అర్వపల్లి : కోమటిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక

**ఆత్మకూర్ (ఎస్) :** ప్రజారోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సర్పంచ్ గంధం అనసూర్య అన్నారు. మంగళవారం రామన్నగూడెం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ఎంపీటీసీ నారగాని యల్లమ్మ, కన్నయ్య, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ కన్నోజు వెంకటేశ్వర్లు, వెంకన్న, దుర్గాప్రసాద్, పన్నాల వెంకట్‌రెడ్డి, దుర్గయ్య, సూపర్‌వైజర్ రంగమ్మ, నిర్మల, ఉమ, మహేశ్వరి పాల్గొన్నారు.

**పెన్‌పహాడ్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి కోరారు. మంగళవారం రంగయ్యగూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తొగరు కళావతి, తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట :** తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని 43వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నామా అరుణప్రవీణ్, కమిషనర్ రామానుజులరెడ్డి, అధికారులు, వైద్య సిబ్బంది, నాయకులుపాల్గొన్నారు.

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**


**మద్దిరాల :** ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిలివేరు భవాని లింగరాజు, ఎంపీటీసీ ఏలేటి ఉమా మల్లారెడ్డి, కన్న వీరన్న, జిలకర చంద్రమౌళి, ఉపసర్పంచ్ పాతూరి లక్ష్మీ ఉపేందర్‌రెడ్డి, రేసు వెంకన్న, పాతూరి లింగారెడ్డి, శేరి ఆదిరెడ్డి, నల్ల మధు, పాలబిందెల శ్రీనివాస్, గుర్రాల మహేందర్‌రెడ్డి, భూతం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**అర్వపల్లి :** గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. మండల పరిధిలోని కోమటిపల్లిలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18ఏళ్లు పైబడిన వారంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాల నర్సయ్య, ఉపసర్పంచ్ గౌరమ్మ, కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్‌ఓ ఎల్. చరణ్, పంచాయతీ కార్యదర్శి పర్వీన, ఆప్తమాలజిస్ట్ ఎ. వేణు, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, ఏఎన్‌ఎం రమణ, వార్డు సభ్యులు మాంద్ర లింగయ్య, బీబమ్మ, ఆశా కార్యకర్త జాల హైమావతి, కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

**భానుపురి :** ఎలాంటి వివాదాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుని ఉంటున్న పేదలు ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ రాజేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 125 చదరపు గజాలలోపు ఇంటి స్థలాలకు ఉచితంగా, 125 చదరపు గజాల పైన ఉన్న ఇంటి స్థలాలకు మార్కెట్ రేటు ప్రకారం ధర చెల్లించిన వారికి పట్టాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. 2020 జూన్ 2వ తేదీకి ముందు ఆ స్థలంలో కచ్చితంగా విద్యుత్తు, ఇంటి పన్నులు చెల్లిస్తున్న రశీదులు ఆధారంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 30వ తేదీ నాటికి సమీపంలోని మీసేవా కేంద్రాల్లో యూజర్ చార్జీలు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

**సూర్యాపేట రూరల్ :** రోజు వారి ఆహారంలో చిరుధాన్యాలను అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మంగళవారం కేటీ అన్నారం గ్రామంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రోజువారి ఆహారంలో ఏదో ఒక రూపంలో ఒక పూట చిరుధాన్యాలు తీసుకోవాలని, అప్పుడే మనకు పౌష్టికాహారం అందుతుందన్నారు. నేటి కాలంలో చిరుధాన్యాలు కనుమరుగవుతున్నాయని, చిరుధాన్యాలను పండించాలని రైతులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రంగా ఉండి, పౌష్టికాహారం తీసుకుంటున్న చిన్నారులకు వెల్‌బేబీ షో సర్టిఫికెట్లు అందజేశారు. అదే విధంగా చిరుధాన్యాలతో చేసిన వంటలను ప్రదర్శించారు. పోషణ్ పక్వాడ ముగింపు వేడుకలను నిర్వహించారు. స్వస్థ బాలక్ స్పర్ధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ కిరణ్మయి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ నాయుడు, సర్పంచ్ బైరెడ్డి అలివేలుభీమ్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గాలీబ్ అహ్మద్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### రక్త నమూనాల సేకరణ

**తిరుమలగిరి :** వెలిశాల గ్రామంలో మంగళవారం రాత్రి బోద వ్యాధి నిర్ధారణ కోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రక్త నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల వీరయ్య, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సబ్ యూనిట్ అధికారి నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి బీంజా, వెంకటమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రాఘవపురంలో గ్రామసభ

**తిరుమలగిరి :** వేసవి కాలం దృష్ట్యా గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని రాఘవపురం సర్పంచ్ ధరావత్ మహేష్ కోరారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు వాడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.